

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన సుముఖి నృత్యాలయం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది.



రేపు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: అభిషేక మండపంలో ఈనెల 23న హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈఓ. శ్రీనివాస రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి సిబ్బంది అందరూ హాజరు కావాలని కోరారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,629
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,24,129
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,213

న్యూస్‌రీల్

ఆర్‌యూ హాస్టళ్లలో వసతులు మెరుగు పరుస్తాం



సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ వీసీ

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలోని హాస్టళ్లలో వసతులను మెరుగు పరుస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ అన్నారు. హాస్టళ్ల సమస్యలపై విద్యార్థుల నుంచి పలు ఫిర్యాదులు అందటంతో ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ సిబ్బందికి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. మెన్, ఉమెన్ హాస్టళ్లలో సివిల్, ఎలక్ట్రికల్ పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. డైనింగ్ హాల్, కిచెన్ శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. వర్సిటీ హాస్టళ్ల చీఫ్ వార్డెన్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, వార్డెన్ డాక్టర్ వై. హరిప్రసాదరెడ్డి, ఇంజినీర్ నరసప్ప, డిప్యూటీ వార్డెన్లు పాల్గొన్నారు.

డీసీసీబీ సీఈఓగా నాగిరెడ్డి!

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా నాగిరెడ్డి నియమితులయ్యే అవకాశం ఏర్పడింది. ఈ పోస్టు ఈ ఏడాది జనవరి నుంచి ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్ పూర్తి అదనపు బాధ్యతలతో వ్యవహరిస్తున్నారు. ఇటీవలే ఆప్కాబ్ సీఈఓ పోస్టు భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేయగా.. దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగిసే సమయానికి డీసీసీబీ డీజీఎంగా పనిచేస్తున్న నాగిరెడ్డి ఒక్కరే దరఖాస్తు చేసుకున్నారు. ఈయన నియామకానికి టీడీపీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా లేఖలు ఇచ్చినట్లు సమాచారం. పోటీ లేనందున సీఈఓగా నాగిరెడ్డి నియామకం ఖాయమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.


తేలికపాటి వర్షాలే!

కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో తేలికపాటి వర్షాలు మాత్రమే కురిశాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లా మొత్తంగా సగటున 1.1 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది. కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, కల్లూరు, నందవరం, సి.బెళగల్, ఆదోని, కోసిగి తదితర మండలాల్లో చిరు జల్లులు మాత్రమే పడ్డాయి. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ. ఉండగా.. 21 రోజుల్లో 54.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

29 మంది తహసీల్దార్ల రిలీవ్

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో పనిచేస్తున్న 29 మంది తహసీల్దార్లను రిలీవ్ చేస్తూ కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఉత్వర్వులు విడుదల చేశారు. వీరంతా జోన్-4 పరిధిలోని ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల నుంచి ఎన్నికల ముందు కర్నూలు జిల్లాకు బదిలీపై వచ్చారు. అయితే ఎన్నికలు ముగియడంతో తమను పాత జిల్లాలకు పంపాలని తహసీల్దార్లు కోరిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో జిల్లాలో పనిచేస్తున్న చిత్తూరుకు చెందిన తొమ్మిది మంది, అనంతపురానికి చెందిన పది మంది, తిరుపతికి చెందిన ముగ్గురు, సత్యసాయి జిల్లాకు చెందిన నలుగురు, వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన ఒకరు, అన్నమయ్య జిల్లాకు చెందిన ఇద్దరిని కలెక్టర్ రిలీవ్ చేశారు. కాగా, జిల్లా నుంచి ఎన్నికల ముందు వెళ్లిన 30 మంది తహసీల్దార్లను ఆయా జిల్లాల కలెక్టర్లు రిలీవ్ చేసిన నేపథ్యంలో సోమవారం వారు కలెక్టర్‌కు రిపోర్టు చేసుకునే అవకాశం ఉంది. తరువాత వారిని మండలాలకు కేటాయిస్తారు.

బీడీ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఓబులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో రద్దు చేసిన బీడీ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి నిధులను కేటాయించాలని బీడీ కార్మికుల సమన్వయ కమిటీ రాష్ట్రకన్వీనర్ జి.ఓబులు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో బీడీ కార్మికుల రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. రూ.3 వేల పెన్షన్, ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీడీ కార్మికుల సమన్వయ కమిటీ కో కన్వీనర్‌గా ఉన్న చైతన్య స్థానంలో కర్నూలుకు చెందిన ఎస్.ఇక్బాల్‌హుస్సేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, నాయకులు పాల్గొన్నారు.

మొదలైన ఫీజు కష్టాలు

- కూటమి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత కరువు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- ఐదేళ్ల జగన్ పాలనలో జిల్లాకు రూ.501.60 కోట్లు విడుదల
- 2019లో చంద్రబాబు బకాయిలను క్లియర్ చేసిన గత ప్రభుత్వం

విద్యార్థులకు 'ఫీజు' కష్టాలు మొదలయ్యాయి. గత ప్రభుత్వం మూడు నెలలకు ఒక సారి ఠంచన్‌గా జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన విడుదల చేసేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో ఐదేళ్ల పాటు నిశ్చింతగా ఉన్న విద్యా రంగం కూటమి ప్రభుత్వంలో ఒడిదుడుకులకు గురవుతోంది. మళ్లీ ఐదేళ్ల క్రితం నాటి కష్టాలను చవి చూడాల్సి వస్తుందేమోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్, పీజీ తదితర కోర్సుల్లో చేరేందుకు విద్యా సంవత్సరం ప్రారంభమైంది. జూన్ నుంచి ఆగస్టు నెల వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు సందడిగా ఉంటున్నాయి. కోర్సు పూర్తి చేసిన వారు ఆయా కళాశాలల నుంచి సర్టిఫికెట్లతో బయటకు వెళ్లడం, లేదంటే పైతరగతులకు వెళ్లడం జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆయా కళాశాలలు మొదటి టర్మ్ ఫీజు చెల్లించాలని కోరడం ఆనవాయితీ. ఆర్థికంగా ఉన్న వారైతే తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఫీజులను చెల్లిస్తారు. కానీ, పేద మధ్య తరగతి వర్గాలకు చెందిన తల్లిదండ్రులకు వేలకు వేలు ఫీజు చెల్లించడం ఇబ్బందిగా మారుతోంది. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి 'జగనన్న విద్యా దీవెన', 'జగనన్న వసతి దీవెన' పేరుతో విద్యార్థులకు ఆర్థిక వెసులుబాటును కల్పిస్తూ వచ్చింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పథకాలకు పేర్లు మార్చింది కానీ, అసలు వీటిని ఏ విధంగా అమలు చేస్తామనే అనే విషయంలో ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదు. ప్రతి ఏడాది జూన్ నెలలో చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనపై ఇప్పటి వరకు స్పష్టత కొరవడడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సజావుగా జరుగుతున్న పథకాలకు పేర్లు మార్చడంలో ఉన్న శ్రద్ధ నిధులు విడుదల చేయడంలో లేదని కూటమి ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

చంద్రబాబు పెండింగ్‌ను క్లియర్ చేసిన జగన్ సర్కార్

2017-18, 2018-19 విద్యా సంవత్సరాల్లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2019-20 విద్యా సంవత్సరంలో విడుదలయ్యాయి. జిల్లాలో 32,162 మంది విద్యార్థులకు సంబంధించిన అరియర్స్‌ను వైఎస్ జగన్ ప్రభుత్వం విడుదల చేసింది. అలాగే కుటుంబ వార్షిక ఆదాయాన్ని కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.లక్షగా నిర్ధారిస్తే, వీలైనంత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరాలనే సదుద్దేశంతో జగన్ ప్రభుత్వం రూ.2.50 లక్షలకు పెంచింది. ఈ నేపథ్యంలోనే వసతి దీవెన పథకం ద్వారా ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు రూ.20 వేల ప్రకారం అందించింది.

ఫీజును పెంచి సాహసోపేతమైన నిర్ణయం

గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టిన సమయంలో బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు విద్యార్థుల ఇంజినీరింగ్ విద్యకు ఏడాదికి రూ.35 వేలు మాత్రమే విడుదలయ్యేవి. కానీ, కొన్ని పెద్ద కళాశాలల్లో (గ్రేడ్ -1) ఇంజినీరింగ్ ఫీజు ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఉంది. ఆయా కళాశాలల్లో చదువుతున్న సంబంధిత సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసే రూ.35 వేలను మినహాయించి మిగిలిన ఫీజు వారి తల్లిదండ్రులే చెల్లించాల్సి వచ్చేది. ఈ ఆర్థిక భారాన్ని కూడా తొలగించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచాలని నిర్ణయం తీసుకొని అమలు చేశారు. ఈ నేపథ్యంలోనే జగనన్న విద్యా దీవెన పేరుతో ఆయా విశ్వవిద్యాలయాలు నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రేడ్-1 కళాశాలల్లో అనేక మంది విద్యార్థులు ఇంజినీరింగ్ తదితర కోర్సులను ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తి చేసి కుటుంబాలకు ఆసరాగా నిలిచారు.

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో విడుదలైన మొత్తం ...

సంవత్సరం	విద్యా దీవెన విద్యార్థులు	విడుదలైన మొత్తం	వసతి దీవెన విద్యార్థులు	విడుదలైన మొత్తం
2019-20	44,360	రూ.94,76,97,334	41,098	రూ.39,99,30,000
2020-21	48,728	రూ.74,18,92,766	47,468	రూ.46,25,25,000
2021-22	40,032	రూ.82,10,00,217	46,818	రూ.42,38,25,300
2022-23	40,857	రూ.62,12,10,996	39,350	రూ.35,24,10,000
2023-24	31,462	రూ.23,18,31,802	----	రూ.1,36,96,200 (ఎస్సీ విద్యార్థులకు మాత్రమే)
మొత్తం:	2,05,439	రూ.336,36,33,115	1,74,734	రూ.165,23,86,500

ఐదేళ్లలో రూ.501.60 కోట్లు విడుదల

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ తదితర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కింద రూ.501.60 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఫీజులపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చేస్తున్న విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. పలు ప్రైవేటు కళాశాలలు బకాయి పడిన ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామని తెల్చి చెబుతుండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం



విద్యా సంవత్సరం ప్రారంభమై అన్ని కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఫీజును వెంటనే విడుదల చేయాలి. ఫీజు విడుదలలో కాలయాపన జరిగితే మెజారిటీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది. గత ప్రభుత్వం జూన్ నెలలో జగనన్న విద్యా దీవెన కింద మొదటి విడతగా ఫీజులను తల్లుల ఖాతాల్లో జమ చేసింది.

– ఆర్ చంద్రప్ప, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు



రాష్ట్ర ప్రభుత్వం ఫీజులను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఫీజులను కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. గత ప్రభుత్వం ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఫీజులను జమ చేయడం వల్ల ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. తక్షణమే ప్రభుత్వం విద్యా దీవెన, వసతి దీవెన నిధులను విడుదల చేయాలి. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు అందించాలి.

– ఏ నాగరాజు, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు

శాకంబరీ.. నమోస్తుతే!



శాకంబరి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీశైలంటెంపుల్: ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారికి ఆదివారం శాకంబరి ఉత్సవాన్ని నిర్వహించారు. వేడుక సందర్భంగా మూలమూర్తిని, ఉత్సవమూర్తిని వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించారు. అలాగే అమ్మవారి ఆలయ ప్రాంగాణాన్ని సైతం అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం సూచనల మేరకు పలువురు దాతలు కూరగాయలను, ఆకుకూరలను విరాళంగా సమర్పించారు. ముందుగా సంకల్పం పఠించి, మహాగణపతి పూజ జరిపారు. తరువాత శాకంబరిగా అలంకరించిన అమ్మవారి ఉత్సవమూర్తికి విశేష పూజలు చేశారు. శాకంబరి అలంకారంలో అమ్మవారిని భక్తులు దర్శించుని పునీతులయ్యారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన సహాయ కార్యనిర్వహణాధికారి జి.స్వాములు, పర్యవేక్షకులు అయ్యన్న, మల్లికార్జున అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వ శుభంకరి

పూర్వం హిరణ్యాక్షుని వంశానికి చెందిన దుర్గమడు అనే రాక్షసుడు తన తపశక్తితో వేదాలను అంతర్థానం చేశాడు. దాంతో యజ్ఞయాగాదులు నిలిచిపోయాయి. ఈ కారణంగా కరువు కాటకాలతో తీవ్రమైన క్షామం ఏర్పడింది. అప్పుడు మహర్షులందరూ గొప్ప తపస్సు చేశారు. ఆ తపస్సుకు పరాశక్తి ప్రసన్నురాలై లోకరక్షణకోసం దుర్గముడిని సంహరించి, వేదాలను రక్షించి, వైదికకర్మలను పునరుద్ధరించారు. ఆ సందర్భంలోనే జగన్మాత తన నుంచి వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, ఫలాలు మొదలైన వాటిని సృష్టించి జీవుల ఆకలి తీర్చారు. ఈ కారణంగానే ఆషాడ పౌర్ణమి రోజున అమ్మవారిని శాకాలతో అలంకరించి, అర్చించే సంప్రదాయం ఏర్పడింది.

నేడు టీబీ డ్యాం గేట్ల ఎత్తివేత?

హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సోమవారం డ్యాం గేట్లు ఎత్తి నీటిని నదికి వదిలే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో టీబీ బోర్డు అధికారులు నదీతీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. నది సమీపంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. తాగునీటి అవసరాల కోసం తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు వదిలిన నీరు ఆదివారం రాత్రి హొళగుంద సెక్షన్‌కు సంబంధించి సబ్ డివిజన్-4 (184 కి.మీ)లోకి ప్రవేశించాయి. ఆ నీరు మంగళవారం రాత్రికి టీబీ బోర్డు సరిహద్దు 250 కి.మీ, హన్వాళ్ సెక్షన్ దాటి జిల్లాలోకి ప్రవేశించనున్నాయి.



తుంగభద్ర జలాశయం

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా హ్యాండికాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం శివారెడ్డి కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 55 ఏళ్ల వయస్సు పైబడిన దివ్యాంగ ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ అవకాశం ఇస్తూ వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. కర్నూలు సమీపంలో దివ్యాంగ ఉద్యోగుల కాలనీ ఏర్పాటు చేసి కనీస ధరకు ప్రభుత్వం స్థలాలు కేటాయించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ తగ్గించకుండా వంద శాతం చెల్లించాలన్నారు. కమ్యూనల్ అలవెన్స్ బేసిక్ పే ప్రకారం 20 శాతం ఇవ్వాలన్నారు. శారీరక, దివ్యాంగ ఉద్యోగులకు ఫేషియల్ యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి కే కృష్ణుడు, ఉపాధ్యక్షులు వీరేష్, సంయుక్త కార్యదర్శి పీహెచ్ శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం రంగస్వామి, కోశాధికారి సాంబశివరావు, రాజశేఖర్ తదితరులు హాజరయ్యారు.



సమావేశంలో పాల్గొన్న దివ్యాంగ ఉద్యోగులు

విద్యార్థుల భవిష్యత్తుకు నవోదయం

- 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 16వ తేదీ వరకు గడువు
- కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యార్థులకు అవకాశం
- జనవరి 18న ప్రవేశ పరీక్ష
- సీటు సాధిస్తే 7 సంవత్సరాల పాటు ఉచిత విద్యాబోధన



బనవాసి నవోదయ విద్యాలయ ముఖ ద్వారం

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ.. ఉత్తమ విద్యా బోధన అందిస్తూ ఎమ్మిగనూరు సమీపంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం పేరుగాంచింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు 1986లో దీనిని స్థాపించారు. ఈ విద్యాలయంలో సీటు వచ్చిందంటే చాలు తమ బిడ్డ భవిత బంగారమేనని తల్లిదండ్రులు భావిస్తున్నారు. నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష ప్రకటన విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 2025 జనవరి 18న ప్రవేశ పరీక్ష ఉంటుంది. సెప్టెంబర్ 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 80 సీట్లు అందుబాటులో ఉండగా బాలికలకు 30 శాతం సీట్లు, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. మొత్తం 80 సీట్లలో 75 శాతం అంటే 60 సీట్లను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు, 20 సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయిస్తారు.

అత్యుత్తమ విద్యా ప్రమాణాలు

నవోదయ విద్యాలయంలో సీబీఎస్‌ఈతో కూడిన అత్యుత్తమ విద్యా బోధన అందిస్తారు. నిపుణులైన అధ్యాపకులు బోధిస్తారు. సువిశాల ప్రాంగణం, ఆహ్లాదకర వాతావరణం, అధునాత కంప్యూటర్ ల్యాబ్, పోషక విలువలతో కూడిన ఆహారం, మానసికోల్లాసానికి క్రీ డలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, ఎన్‌సీసీ తదితర అంశాలు నవోదయ విద్యాలయ ప్రత్యేకతలు. సీబీఎస్‌ఈ పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తూ నవోదయాలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

విశాల గ్రంథాలయం

బనవాసి నవోదయ విద్యాలయంలో విద్యార్థుల సౌకర్యార్థం సైన్స్, గణితం, సాహిత్యం తదితర అంశాలకు సబంధించిన పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచారు. అలాగే సమకాలీన వార్తాంశాలపై అవగాహన కోసం పలు తెలుగు, ఆంగ్ల ప్రతికలను విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నారు. గంథ్రాలయంలో విద్యార్థు తమ జ్ఞానాన్ని పెంపొందించుకుంటారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యా బోధన చేసేందుకు శాంసంగ్ స్మార్ట్ క్లాస్ రూం ఏర్పాటు చేశారు. ల్యాప్ ట్యాప్‌లు, టాబ్‌లను విద్యార్థులకు అందుబాటులో ఉంచి వేగవంతమైన అంతర్జాల సౌకర్యం కల్పించారు. డిజిటల్ క్లాస్ రూమ్స్‌లో నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నారు.

అంతా ఉచితమే..

నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉచితమే. ఆరు నుంచి 12వ తరగతి వరకు ఏడు సంవత్సరాల పాటు అత్యుత్తమ విద్య అందిస్తారు. భోజనం, వసతి, యూనిఫాం, బూట్లు, పుస్తకాలను అందిస్తారు. విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆరోగ్య పర్యవేక్షణ కోసం స్టాఫ్ నర్స్ అందుబాటులో ఉంటారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

ఆటలు...సాంస్కృతిక కార్యక్రమాలు

నవోదయ విద్యాలయంలో 37 ఎకరాల్లో సువిశాల క్రీడా ప్రాంగణం ఉంది. బనవాసి నవోదయ విద్యార్థులు రీజనల్, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు. క్రమశిక్షణ, విలువలు పెంపొందించేందుకు ఎన్‌సీసీ, నేషనల్ గ్రీన్ కోర్, స్కాట్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు సంగీతం, నృత్యం, చిత్రలేఖనం తదితర అంశాల్లోనూ శిక్షణ అందిస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు సువర్ణ అవకాశం



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇది సువర్ణ అవకాశం. విద్యాలయంలో అత్యుత్తమ విద్యాప్రమాణాల సాధన లక్ష్యంగా పటిష్ట విద్యా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. విద్యార్థులు సర్వోతోముఖాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మానసిక నిపుణలతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. వారి ఉజ్వల భవిష్యత్తు కోసం కేరీర్ గైడెన్స్ సెల్ ఏర్పాటు చేశాం. పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నాం. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు చాలా మంది ఉన్నత స్థాయిలో ఉన్నారు.

– ఇ. పద్మావతి, ప్రిన్సిపాల్, బనవాసి నవోదయ

అర్హతలు ఇవే..

- నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశానికి ఒక్కసారి మాత్రమే పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అన్ని మండలాల్లో 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు.
- 2025-26 విద్యాసంవత్సరం కోసం 6వ తరగతి ప్రవేశ పరీక్షకు హాజరయ్యే బాలబాలికలు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.
- ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3,4 తరగతులు పూర్తి చేసి ప్రస్తుతం 5వ తరగతి చదువుతూ ఉండాలి.

- వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 08512-246544
- దరఖాస్తు చేసుసకోవాల్సిన వెబ్‌సైట్: htps://cbseitms.rcil.gov.in/nvs

క్లుప్తంగా

23న జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): నంద్యాల పట్టణంలోని ఎస్డీఆర్ వరల్డ్ స్కూల్‌లో ఈనెల 23న ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్ టెన్నిస్ సంఘం జిల్లా కార్యదర్శి నవీన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు వచ్చే నెల 4, 5 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 23 వ తేదీ ఉదయం 11 గంటలకు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో పాటు నాలుగు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 సంవత్సరంలో జన్మించి ఉండాలన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


భూపాలు నాయుడు (ఫైల్)

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన బెజ్జిన గారి భూపాల్ నాయుడు (50) అనే వ్యక్తి పాముకాటుకు గురై మృతిచెందాడు. ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా శనివారం అర్ధరాత్రి పాము కాటేసింది. బాధితుడు వెంటనే విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అయితే, కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రమీలతోపాటు పాటు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

సచివాలయ సెక్రటరీ అదృశ్యం


చక్రధర్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని 20వ వార్డు సచివాలయంలో అమెనిటీస్ సెక్రటరీగా పనిచేస్తున్న చక్రధర్(31) అదృశ్యమయ్యాడు. శిరివెళ్ల మండలం మహదేవాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు అయిన చక్రధర్ ఈనెల 18 వ తేది ఉదయం విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం 3 గంటల నుంచి తన సెల్ స్విచ్ఆఫ్ చేసి కనిపించకుండా పోయాడు. ఈ మేరకు తండ్రి ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ నరసింహులు ఆదివారం తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని కైప గ్రామానికి చెందిన చెన్నయ్యపై వరకట్న వేధింపుల కేసు నమోదైంది. ఇతను ఎనిమిదేళ్ల క్రితం స్వర్ణలత అనే మహిళను వివాహం చేసుకున్నాడు. మొదట్లో వీరి సంసారం సాఫీగా సాగింది. కొన్ని సంవత్సరాల నుంచి కుటుంబ సభ్యులతో కలిసి చెన్నయ్య.. భార్యను అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈమేరకు బాధితురాలు స్వర్ణలత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ ఆదివారం తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


సహెరభాను(ఫైల్)

నందికొట్కూరు:భర్త, అతని కుటుంబసభ్యుల వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన షేక్ మాసుంబాషా .. సహెరాభాను (25) అనే తన కుమార్తెను 2023 ఫిబ్రవరి 18వ తేదీ నందికొట్కూరు పట్టణంలోని లింగంవీధికి చెందిన షేక్ వలి పెద్ద కుమారుడు షేక్ హుసేన్‌కు ఇచ్చి వివాహం చేశాడు. కట్నకానుకల కింద 20 తులాల బంగారం ఇచ్చాడు. వివాహమైన తర్వాత సహెరభాను(25)ను అందంగా లేదని భర్త, అతని కుటుంబసభ్యులు వేధించడం మొదలుపెట్టారు. దీంతో మనస్తాపానికి చెందిన ఆమె ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త షేక్ హుసేన్, మామ షేక్ వలి, అత్త షేక్ వహిదా, ఆడపడుచు షేక్ రిజ్వాన, మరిది షేక్ సాధిక్ వేధింపులే తన కుమార్తె మృతికి కారణమని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి 9 నెలల కుమారుడు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలు నివారిద్దామిలా..

- స్విచ్ బోర్డులు తగినంత ఎత్తులో ఉండాలి
- తడిచేతులు, తడికాళ్లతో స్విచ్‌లు వేయరాదు
- ఏదైన సమస్య ఉంటే వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలి
- విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి



కర్నూలు(అగ్రికల్చర్): వానాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. తగిన జాగ్రత్తలు పాటిస్తే ఈ ప్రమాదాలను నివారించవచ్చునని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. ఇప్పటికే ఆ శాఖ అధికారులు వినియోగదారులు పాటించాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పిస్తున్నారు. భద్రతా చర్యలపై రూపొందించిన కరపత్రాలను సైతం విడుదల చేశారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో విద్యుత్ ప్రమాదాల నివారణకు ఎస్ఈ కొన్ని సూచనలు చేశారు.

- వినియోగదారులు వారి ఆవరణలోని అంతర్గత వైరింగ్‌కు ఉపయోగించే విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు ఇతర పరికరాలను నాణ్యత (ఐఎస్ఐ) కలిగిన వాటిని ఉపయోగించాలి. ఇంటిలోని స్విచ్ బోర్డులను భద్రతా ప్రమాణాలు పాటిస్తూ తగినంత ఎత్తులో అమర్చుకోవాలి.
- విద్యుత్ సర్వీస్‌కు వినియోగించే సర్వీస్ వైరు నాణ్యమైనది ఉండాలి. లోడుకు అనుగుణంగా తగు కెపాసిటి ఉంటాలి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను, వోల్టేజి హెచ్చుతగ్గులను నివారించుకోవచ్చు. ప్రతి ఇంటి విద్యుత్ సర్వీస్‌కు, ఇంటిలో ఉపయోగించే పరికరాలకు తప్పనిసరిగా ఎర్త్‌పైపు ద్వారా ఎర్తింగ్‌ను ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చు.
- వర్షాలు పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు (సపోర్టు వైర్లు)ముట్టుకొనరాదు. తడి చేతులతో, తగికాళ్లతో ఉన్నప్పుడు స్విచ్‌లు వేయరాదు. విద్యుత్‌కి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందిని మాత్రమే సంప్రదించాలి. ఇళ్లపై బట్టలు ఆరవేసేటప్పుడు, ఇళ్ల నిర్మాణం జరుగుతున్నప్పుడు తీగలకు తగినంత దూరం పాటించాలి.


భద్రతా చర్యలపై కరపత్రాలు విడుదల చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

- కొబ్బరి పామోలిన్ మొదలైన తోటల్లో కొమ్మలు తొలగించేటప్పుడు విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ముందుగా తెలియజేస్తే స్థానికి విద్యుత్ సిబ్బంది ద్వారా అవసరమైన విధంగా లైన్ క్లియర్ ఏర్పాటు చేసి వారి పర్యవేక్షణలో పనిచేయవచ్చు. తొందరపడి ప్రమాదాలను తెచ్చుకోవద్దు.
- వీధి దీపాలకు సంబంధించిన ఫీజ్ వైర్ల మరమ్మతులకు లైన్ క్లియర్ తీసుకోవాలి. పాడైన స్విచ్‌లు, బల్బులు తదితర వాటిని అనుమతించిన సిబ్బందే మార్చాలి. ఇతర ఏ వ్యక్తులు చేయరాదు. తోటలు, పొలాలు, ఇతర ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు తెగిపడి ఉంటే వాటిని నేరుగా తాకరాదు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 టోల్‌ఫ్రీ నంబరుకు తెలియచేయాలి.
- ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనిస్తే ఆ వ్యక్తినిగాని, విద్యుత్ పరికరాన్ని గాని నేరుగా తాకరాదు. వెంటనే దగ్గరలోని విద్యుత్ అధికారి/ సిబ్బందికి తెలియజేయాలి. పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులు, విద్యుత్ పరికరాలను రిపేరీ చేయువారు తగిన భద్రత నియమాలను పాటించాల్సి ఉందని ఎస్ఈ వివరించారు. సమావేశంలో ఈఈ ఓబులేసు, డీఈఈ విజయకుమార్, విద్యుత్ శాఖ సీఐ పార్థసారధి రెడ్డి, ఏఈ టెక్నికల్ శ్రీనివాసులు, ఎస్ఐ విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు నగరంలో ఫిర్యాదులకు సంప్రదించాల్సిన వివరాలు...

సెక్షన్ పేరు	సెక్షన్ ఆఫీసర్	ఫిర్యాదు చేయాల్సిన ఫోన్ నెంబరు
పవర్ హౌస్	ఏఈఈ/పవర్‌హౌస్	08518-221919 9440813356
సెంటల్ సెక్షన్	ఏఈఈ/సెంట్రల్	081518-221918 9440813361
బి.రోడ్	ఏఈఈ/బి.రోడ్	08518-257064 9440813362
సంతోష్‌నగర్	ఏఈఈ/సంతోష్‌నగర్ డీ1 సబ్ డివిజన్ కర్నూలు డీఈఈ/డీఎస్‌డీ-1	08518-250577 9440813332
ఓల్డ్ టౌన్	ఏఈఈ/ఓల్డ్‌టౌన్	08518-240276 9440813359
ఇండస్ట్రియల్ ఎస్టేటు	ఏఈఈ/ ఇ-ఎస్టేటు	9440797332 9440816228
బి.క్యాంపు	ఏఈఈ/బి.క్యాంపు	08518-229862 9440813360
డి2 సబ్ డివిజన్	డీఈఈ డీఎస్‌డీ-2	9491067203
టోల్‌ఫ్రీ నంబరు		1912

అన్నం తింటున్నవారిని లాక్కొచ్చి కొట్టారు

- ఆర్.కొంతలపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణుల దాడి
- ముగ్గురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు


దాడిలో గాయపడిన పద్మావతి, చిన్నహుసేన్

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు మండలంలోని ఆర్.కొంతలపాడులో ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. ఇంట్లో అన్నం తింటున్నవారిని బయటకు లాక్కొచ్చి తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో పదిమంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలవడంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.ఆర్.కొంతలపాడుకు చెందిన పెద్దహుసేన్, చిన్నహుసేన్ అన్నదమ్ములు. వీరు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆదివారం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. రాత్రి 7.30 గంటల సమయంలో పిల్లలు, పెద్దలు కలిసి ఇంట్లో అన్నం తింటున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన వారి బంధువులు, టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులైన ఆ పార్టీ కార్యకర్తలు బోయ మధు, సంజీవ, రామాంజనేయులు, మల్లికార్జున తదితరులు ఒక్కసారిగా దాడిచేశారు. పిల్లలు, పెద్దలు అందరినీ తిడుతూ, కొడుతూ బయటకు లాక్కొచ్చారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేస్తారా, ఆ పార్టీ నాయకులతో కలిసి తిరుగుతారా అంటూ కర్రలతో తీవ్రంగా కొట్టారు. ఈ సమాచారం తెలిసి వచ్చిన పోలీసులు వారిస్తున్నా వినిపించుకోలేదు. వారి ఎదురుగానే ఇష్టారీతిన ప్రవర్తించారు. వారి దాడిలో పదిమందికి దెబ్బలు తగిలాయి. వీరిలో తీవ్రంగా గాయపడిన పెద్దహుసేన్, చిన్నహుసేన్, ఆయన భార్య పద్మావతిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. వీరిలో పద్మావతి చేతికి బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కాగా చిన్నహుసేన్, పెద్దహుసేన్‌ల శరీరమంతా కర్రల దెబ్బలు కనిపిస్తున్నాయి. దాడిచేసినవారు తమ సమీప బంధువులేనని, తాము వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నందుకు దాడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

వెండి ఆభరణాల మెరుగు పేరిట మోసం

- గుర్తించి నిందితులను పట్టుకున్న చింతకుంటవాసులు


కరిగిపోయిన వెండి కడియాలు, పట్టీలు చూపుతున్న బాధితులు


పట్టుబడిన మోసగాళ్లు

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో బిహార్ రాష్ట్రానికి చెందిన నలుగురు యువకులు వెండి ఆభరణాల మెరుగు పేరుతో మోసం చేసేందుకు యత్నించి పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం సాయంత్రం నలుగురు వ్యక్తులు చింతకుంట గ్రామానికి వచ్చారు. పాత వెండి వస్తువులు, ఆభరణాలను ఉచితంగా మెరుగు పరిచి ఇస్తామని ఇంటింటా తిరిగారు. కొందరు మహిళలు నమ్మి వెండి కడియాలు, పట్టీలు వారికి అందించారు. వారి వద్ద ఉన్న లిక్విడ్ యాసిడ్‌తో శుభ్రం చేసి తళతళ మెరిసేలా చేసి ఇచ్చారు. దీనిని చూసిన మరో మహిళ 30 తులాల కడియాలు ఇచ్చారు. శుభ్రం చేసి ఆమె చేతికి ఇవ్వగా సగానికి పైగా కరిగి చిన్నగా మారాయి. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఆమె విషయాన్ని ఇరుగుపొరుగు వారికి చెప్పారు. వారు పట్టుకుని విచారిస్తుండగా మిగతా బాధితులైన మారెమ్మ, తాయమ్మ, యల్లమ్మ, భీమక్క, మహాలక్ష్మి అక్కడికి చేరుకుని తమ దగ్గరున్న కడియాలు, కాళ్ల పట్టీలు కూడా కరిగిపోయాయంటూ వాపోయారు. వెంటనే గ్రామస్తులు ఆ నలుగురిని బంధించి పోలీసులకు అప్పగించేందుకు యత్నించగా ఒకరు పరారయ్యారు. వెండి ఆభరణాలు మెరుగు పేరిట జరిగిన మోసంపై విచారించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. కొత్త వ్యక్తులను నమ్మి విలువైన వస్తువులు ఇవ్వొద్దని ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులకు సూచించారు.

పొలానికి సాగునీరు అందించేందుకు వెళ్లి


మృతి మౌలాలి (ఫైల్)

మహానంది: పంట పొలానికి సాగునీరు అందించేందుకు వెళ్లిన ఓ రైతు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ఈ సంఘటన ఈర్నపాడులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు మౌలాలి (30) పంటపొలానికి వరినారు కోసం నీరు పెట్టేందుకు వెళ్లాడు. విద్యుత్ మోటార్‌ను ఆన్ చేయగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మౌలాలికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం.

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

- శోకసంద్రంలో జూనూతల గ్రామం


మృతదేహం వద్ద గౌరవ వందనం చేస్తున్న ప్రభుత్వ అధికారులు

అవుకు: గన్ మిస్‌ఫైర్ అయి ప్రాణాలు కోల్పోయిన సీఐఎస్ఎఫ్ జవాన్ పెట్నికోట వెంకటేశ్వర్లు (32) అంత్యక్రియలను ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. శనివారం హైదరాబాద్‌లో విధులు ముగించుకుని తిరిగి వెళ్తుండగా గన్‌మిస్‌ఫైర్ అయిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని ఆదివారం జవాన్ స్వంత గ్రామమైన అవుకు మండలం జూనూతల గ్రామానికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భౌతికకాయాన్ని చూసేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. శోకసంద్రంలో మునిగిన కుటుంబసభ్యులను ఓదార్చారు. జవాన్ అంతిమయాత్రలో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. సీఐఎస్ఎఫ్ ఎస్ఐ రవి, బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి, అవుకు తహసీల్దార్ భాస్కర్, డీటీ ప్రసాద్‌బాబు, ఎస్ఐ కిరణ్ తదితరులు నివాళులర్పించారు.తర్వాత అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

వైద్య సదస్సులతో ఆధునిక విజ్ఞానం పెంపు

కర్నూలు(హాస్పిటల్): వైద్య సదస్సులతో ఆధునిక వైద్య విజ్ఞానం మరింత పెరుగుతుందని ఈఎన్‌టీ వైద్యనిపుణులు డాక్టర్ బి. జయప్రకాష్‌రెడ్డి చెప్పారు. స్థానిక ఎన్ఆర్ పేటలోని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో ఈ నెల 20, 21వ తేదీల్లో ఈఎన్‌టీ శస్త్రచికిత్సలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ నూతన వైద్యులకు శిక్షణ అందించడం తనకు వృత్తిపరమైన సంతృప్తిని గాకుండా వ్యక్తిగతంగా మంచి అనుభూతి అందిస్తుందని తెలిపారు. పెద్ద నగరాలకే పరిమితమైన ఇలాంటి వర్క్‌షాప్‌లు కర్నూలులోనూ గత 15 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌నకు ఏపీ, తెలంగాణాతో పాటు కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఢిల్లీ నుంచి 20 మంది నూతన వైద్యులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో తనతో పాటు డాక్టర్ రమేష్, డాక్టర్ ఇంద్రనీల్‌రెడ్డి, డాక్టర్ నదీమ్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ మహేంద్రకుమార్ శిక్షణ అందించినట్లు చెప్పారు. చెవిలోపలి భాగంలో ఉన్న సూక్ష్మమైన ఎముకలు వివిధ కారణాల వల్ల దెబ్బతిన్నప్పుడు రోగులకు వినికిడి లోపం కలుగుతుందన్నారు. ఈ సూక్ష్మమైన ఎముకల పునర్నిర్మాణం చేసే ప్రయోగం పేరు ఆసిక్లోప్లాస్టీ అన్నారు. చిన్నపిల్లలతో సహా వివిధ వయస్సుల వారికి చెవిలో చీము కారడం ఒక జబ్బుగా గుర్తించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే వినికిడి లోపం కలగడమే గాకుండా కొద్దిమందిలో ఇతరత్రా ప్రమాదకర అనర్థాలకు దారి తీయవచ్చని చెప్పారు. మనిషి కపాలంలోని చెవికి సంబంధించిన ఎముకలపై మైక్రోస్కోప్ వినియోగించి నూతన వైద్యులు శిక్షణ అభ్యసించాలని ఆయన సూచించారు.


నూతన ఈఎన్‌టీ వైద్యులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ బి. జయప్రకాష్‌రెడ్డి

మదాసి కురువ సంఘాన్ని బలోపేతం చేద్దాం


కొత్తగా ఎన్నికైన మదాసి కురువ సంఘం కన్వీనర్లు

- జిల్లా కన్వీనర్‌తో పాటు 26 మండలాలకు కన్వీనర్ల ఎంపిక

కర్నూలు(అర్బన్): జిల్లాలో మదాసి కురువ సంఘాన్ని బలోపేతం చేద్దామని మదాసి కురువ, మదారి కురువ ఎస్సీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్న అన్నారు. ఆదివారం స్థానిక రాజ్‌విహార్ సెంటర్ సమీపంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్‌గా ఎం. నాగరాజుతో పాటు 26 మండలాలకు కన్వీనర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన కన్వీనర్లు తమ బాధ్యతను గుర్తు చేసుకుంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి 11 మందితో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వీలైనంత త్వరగా మండల కమిటీలను కూడా పూర్తి చేసి, 5 వేల మందితో నాయకత్వాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రశేఖర్, కలుగొట్ల శివన్న, భరత్‌కుమార్, మల్లప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడు నగరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక..

- వేర్వేరు చోట్ల ఇద్దరు రైతుల ఆత్మహత్య


మృతుడు బీజీ రంగన్న (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: అప్పుల బాధ తాళలేక జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. బాధిత కుటుంబాల్లో విషాదం నింపిన ఈ ఘటనల వివరాలు ఇలా.. మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామానికి చెందిన రైతు బోయ గుడిసె రంగన్న(39) తనకు ఉన్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో 5 ఎకరాలు కౌలు తీసుకున్నాడు. అయితే, పంట సాగుకు అప్పు దొరకలేదు. దీనికితోడు ఇప్పటికే అతనికి రూ. 5 లక్షల వరకు అప్పు ఉంది. దీనిని ఎలా తీర్చాలనే బెంగతో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం పొలం దగ్గర పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు సిఫార్సు మేరకు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఇంటి పెద్ద దిక్కు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడినట్లు అయింది. మృతుడికి భార్య లక్ష్మీ, కుమారుడు జానకీరాముడు, కుమార్తె మంజుల ఉన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామంలో వడ్డే మద్దిలేటి(46) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తాడు. ఇతను తనకున్న రెండు ఎకరాల పొలంతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసుకుంటున్నాడు. కుమార్తెల వివాహానికి, పంటల పెట్టుబడికి చేసిన అప్పు దాదాపు 9 లక్షల వరకు ఉంది. ఈఏడాదిలో ఇప్పటి వరకు సరైన వర్షాలు పడకపోవడంతో పంటలు పండే పరిస్థితి లేదని, దీంతో చేసిన అప్పులు తీరవని మదనపడేవాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో మచ్చుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. మృతుడికి నలుగురు కుమార్తెలు, కుమారుడు సంతానం.

పాఠశాలల్లో శిక్ష సప్తాహ్

- జాతీయ విద్యావిధానం ప్రారంభమై నాలుగేళ్లు
- నేటి నుంచి 29 వరకు శిక్ష సప్తాహ్ పేరుతో వారోత్సవాలు
- తల్లిదండ్రులు, స్థానికుల భాగస్వామ్యం
- మార్గదర్శకాలు జారీ చేసిన సమగ్ర శిక్ష శాఖ


ఎం.కృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు



శిక్ష సప్తాహ్ లోగో

గోస్పాడు: విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2020లో జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) ప్రవేశపెట్టింది. ఈ నూతన విధానాన్ని ప్రారంభించి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా శిక్ష సప్తాహ్ (విద్యావారం) పేరుతో ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకు వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. 2020కు ముందు 10+2+3 విద్యా విధానం ఉండేది.ఆ తర్వాత డాక్టర్ కృష్ణస్వామి కస్తూర్తి రంగన్ సిఫార్సులతో నూతన జాతీయ విద్యా విధానం రూపకల్పన జరిగింది. ఇందులో 5+3+3+ 4 పాఠశాల విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానాన్ని 2020 జూలై 29న కేంద్రం ఆమోదించింది. ఈ నూతన విద్యా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శిక్ష సప్తాహ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, స్థానికుల భాగస్వామ్యం కావాలని జిల్లా విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

వారం రోజుల కార్యక్రమాలు ఇలా....

శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలతో వారం రోజుల పాటు నిర్వహించే ప్రణాళికను జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది.

- **22వ తేది బోధన సామగ్రి ప్రదర్శన:** ఉపాధ్యాయులు స్థానికంగా లభించే వనరులతో తయారు చేసిన బోధనా అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించాల్సి ఉంటుంది. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక పెద్దలను ఆహ్వానిస్తారు.
- **23న పునాది అభ్యసన కార్యక్రమం:** ఈ కార్యక్రమంలో భాగంగా ఒకటో తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి అమలు విషయంలో సమాజ భాగస్వామ్యులకు చర్చ ద్వారా అవగాహన కల్పిస్తారు.
- **24న క్రీడా దినోత్సవం:** విద్యార్థులకు శారీరక సౌష్టవం ప్రాధాన్యత తెలిసేలా వివిధ రకాల క్రీడాంశాలపై పోటీలు నిర్వహిస్తారు. క్రీడల ప్రాముఖ్యతను వివరిస్తారు.
- **25న సాంస్కృతిక దినోత్సవం:** విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు (ఫ్యాన్సీ డ్రెస్, పాటలు, నృత్య ప్రదర్శన, నాటికలు) నిర్వహిస్తారు.
- **26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం:** స్కిల్, డిజిటల్ ఇనిషియేటివ్ డే లో భాగంగా ప్రస్తుత ఉద్యోగావకాశాల నేపథ్యంలో అన్ని తరగతుల వారికి అవసరమయ్యే నూతన నైపుణ్యాలను గుర్తించడం. విద్యలో సాంకేతిక అభివృద్ధిపై చర్చించడం జరుగుతుంది.
- **27న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం:** పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాల (మిషన్ లైఫ్ ఆక్టివిటీస్) కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో పోషణ దినోత్సవం నిర్వహణ (న్యూట్రిషన్ డే), కొత్త ఎకోక్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, వారి తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపై అవగాహన. ప్రతి ప్రభుత్వ బడిలో తల్లి, బిడ్డలతో కలసి మొక్కలు నాటించేలా ఉపాధ్యాయులు కృషి చేయాల్సి ఉంటుంది.
- **29న సామాజిక భాగస్వామ్య దినోత్సవం:** విద్యార్థుల సామాజిక శ్రేయస్సు కోసం ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారంతో పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో తిథి భోజనాలు, విద్యార్థులతో పెద్దలు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేయడం.

మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలి



శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా నిర్వహించాలి. ఇప్పటికే వారం రోజుల పాటు చేయాల్సిన కార్యక్రమాల వివరాలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశాం. కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలతో డాక్యుమెంటేషన్ చేయాలి. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్స్, మండల విద్యాశాఖ అధికారులు శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలి.

–సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల